సాక్షి
వనపర్తి
మంగళవారం ॥ 4 ॥ జూన్ ॥ 2024



శ్రీశైలం ఘాట్ రోడ్డులో..
ఈగలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి.
వివరాలు 8లో ▸



సాగునీటి చౌర్యం?
గండేడ్ మండలం సాలార్‌నగర్ ప్రాజెక్టులో రైతులు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
41.2 /22.3
వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం వేళలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రజాతీర్పుపై ఉత్కంఠ

నేడు లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు
- మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో 142 రౌండ్లలో ఫలితాల వెల్లడి
- నాగర్‌కర్నూల్ స్థానంలోనూ 142 రౌండ్లలో..
- సీఎం రేవంత్ ఇలాకా కావడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- అభ్యర్థుల్లో టెన్షన్.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే..



నాగర్‌కర్నూల్ మార్కెట్‌యార్డు కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన టేబుళ్లు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మహబూబ్‌నగర్‌కు పార్లమెంట్ పరిధిలో జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగంలో, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జిల్లా కేంద్రంలోని నెల్లికొండ సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాల నిఘాలో కేంద్ర బలగాలు, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు, ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా.. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్లు లెక్కించనున్నారు. ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో విజేతలు ఎవరనేది మధ్యాహ్నం వరకు తేలనుంది.

19 నుంచి 22 రౌండ్లలో కౌంటింగ్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్ల లెక్కింపును ఒక్కో నియోజకవర్గంలో 19 నుంచి 22 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 22 రౌండ్లలో, వనపర్తి, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 19 రౌండ్లలో కౌంటింగ్ చేపట్టనున్నారు.ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన తర్వాత ఈవీఎం నుంచి ఓట్లను లెక్కిస్తారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 12,455 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా, వీటి లెక్కింపు కోసం ప్రత్యేకంగా 14 టేబుళ్లను ఏర్పాటుచేశారు. ప్రతి టేబుల్ కౌంటింగ్ వద్ద సీసీ కెమెరాను ఏర్పాటుచేశారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంటు, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఇప్పటికే వీరందరికీ పలు దఫాలుగా శిక్షణ నిర్వహించారు.

ఫలితాలపై సర్వత్రా ఆసక్తి..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకా ఉమ్మడి పాలమూరు కాగా.. దీని పరిధిలోని రెండు లోక్‌సభ స్థానాల ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ అనంతరం 20 రోజులుగా విజయావకాశాలపై సమీక్షల్లో నిమగ్నమైన నేతలు ఓటరు నాడిని అంచనా వేసే ప్రయత్నాలు చేశారు. మహబూబ్‌నగర్‌లో తాము చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని, క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నికలే ఉదాహరణ అంటూ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలతోపాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తన గెలుపునకు విశేష కృషి చేశారని.. తన గెలుపుపై ఎటు వంటి సందేహం లేదని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. మోదీ చరిష్మాతోపాటు ఉమ్మడి జిల్లాలో తాను మంత్రిగా చేసిన అభివృద్ధి పనులు గెలిపిస్తాయని.. ప్రజలు బీజేపీ వెంట నిలిచారని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ధీమా వ్యక్తం చూస్తున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ఎవరికి వారు తమ గెలుపుపై ధీమాగా ఉన్నారు. మరికొన్ని గంటల్లో ఓట్లు లెక్కించనుండడంతో ఓటర్లు ఎవరివైపు నిలిచారనే దానిపై అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల అభిమానులు టెన్షన్ నెలకొంది.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ వివరాలు..

అసెంబ్లీ	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
మహబూబ్‌నగర్‌లో..			
కొడంగల్	1,71,776	14	21
నారాయణపేట	1,63,284	14	20
మహబూబ్‌నగర్	1,71,815	14	20
జడ్చర్ల	1,73,634	14	20
దేవరకద్ర	1,78,602	14	21
మక్తల్	1,74,898	14	21
షాద్‌నగర్	1,84,578	14	19
నాగర్‌కర్నూల్‌లో..			
నాగర్‌కర్నూల్	1,60,394	16	20
అచ్చంపేట	1,61,301	16	22
కొల్లాపూర్	1,55,917	14	21
కల్వకుర్తి	1,77,226	14	20
వనపర్తి	1,82,553	16	19
అలంపూర్	1,77,780	14	21
గద్వాల	1,92,300	16	19

నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున..

పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి 31 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి పోటీ చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి మొత్తం 19 మంది బరిలో నిలిచారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నుంచి మల్లు రవి, బీజేపీ నుంచి పి.భరత్ పోటీ పడ్డారు. రెండు పార్లమెంట్ స్థానాల్లో పది మందికి మించి పోటీదారులు ఉండడంతో ప్రతి పోలింగ్ సెంటర్‌లో డబుల్ ఈవీఎంలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను పాలమూరు యూనివర్సిటీలో లెక్కించనున్నారు. లెక్కింపు కేంద్రంలో ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున.. మొత్తం 98 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు 140 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 153 మంది, మైక్రోఅబ్జర్వర్లు 145 మందికి విధులు కేటాయించారు. 20 శాతం మేర అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పాలమూరు యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లను సోమవారం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో..

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	బరిలో ఉన్న అభ్యర్థులు
16,82,470	12,18,587	72.43%	31 మంది



కౌంటింగ్ కేంద్రం	అసెంబ్లీ నియోజకవర్గం
పీయూలోని ఎగ్జామినేషన్ భవనం	మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర
పీయూలోని ఫార్మా కాలేజీ భవనం	షాద్‌నగర్
పీయూలోని లైబ్రరీ వద్ద..	కొడంగల్
ఇండోర్ స్టేడియంలో..	నారాయణపేట, మక్తల్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో..

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	బరిలో ఉన్న అభ్యర్థులు
17,38,254	12,07,471	69.46%	19 మంది



కౌంటింగ్ కేంద్రం	అసెంబ్లీ నియోజకవర్గం
నెల్లికొండ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నాగర్‌కర్నూల్	గద్వాల, అలంపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు

- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్.. 8:30 నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు



నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వనపర్తి, గద్వాల కలెక్టర్లు తేజస్ పవార్, బీఎం సంతోష్

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం నిర్వహించే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాల్‌ను పరిశీలించారు. కౌంటింగ్ హాల్స్‌లో టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 16 టేబుళ్లు.. అల్లంపూర్, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు అన్నివిధాలా సిద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు.. ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు 8:30 నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. కౌంటింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే, అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ.. ప్రతి రౌండ్‌లో ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదేని సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరి చేస్తారన్నారు. కౌంటింగ్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలని తెలిపారు. అందుకు ప్రత్యేకంగా పాసులు జారీ చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను సరిచేసుకోవాలని సూచించారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ.. పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు, పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. వనపర్తి, గద్వాల కలెక్టర్లు తేజస్ పవార్, సంతోష్, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ఉన్నారు.

కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి

నాగర్‌కర్నూల్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది నియామకానికి సంబంధించి సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకుడు రుచేష్ జైవన్షీ, కౌంటింగ్ అబ్జర్వర్ సత్పాల్ శర్మ, గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. ఈసందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 106 టేబుళ్లకు గాను కౌంటింగ్ సూపర్‌వైజర్స్ 127 మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 131, సూక్ష్మ పరిశీలకులు 130 మందిని కేటాయించినట్లు వివరించారు. అదేవిధంగా 14 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు 16 మంది, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు 16, సూక్ష్మ పరిశీలకులు 16 మందిని కేటాయించినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, వనపర్తి అదనపు కలెక్టర్ నగేష్, గద్వాల అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ పాల్గొన్నారు.

విష సంస్కృతి తీసుకొచ్చిన కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పక్కన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

వనపర్తి: రాష్ట్రంలో తెలంగాణ వ్యతిరేకులు సంబరపడేలా రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులతో కలిసి పాల్గొని జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాలంటే దాయాదుల మధ్య పెట్టుకునే గెట్లు, పంచాయితీల మాదిరిగా కాంగ్రెస్ విష సంస్కృతి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని ఊహాజనిత ఆరోపణలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితాలతో సరైన జవాబిచ్చామన్నారు. తమ అతిపెద్ద జాతీయ పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు దేశంలోని మెజార్టీ రాష్ట్రాల్లో ఉనికి లేదనే విషయం గ్రహించాలని, తమిళనాడులో కొన్ని దశాబ్దాలుగా రెండు ప్రాంతీయ పార్టీలే పాలన సాగిస్తున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీల జెండాలు మోసిన సీఎం రేవంత్ అదృష్టవశాత్తు కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారని ఆరోపించారు. అధికారం కోసం వంద హామీలిచ్చిన పాలకులు ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల్లో నెరవేర్చిన హామీ కేవలం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఆంధ్ర ప్రాంత వాసులతో తెలంగాణ గీతాన్ని మార్చి పైశాచిక ఆనందం పొందుతున్న వారి ముచ్చట మూన్నాళ్లేనని తెలిపారు.

హత్యా రాజకీయాలకు తెర లేపారు..

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు హత్యా రాజకీయాలకు తెర లేపారని, వరుసగా చోటుచేసుకుంటున్న హింసాకాండను ప్రజలు గమనించాలని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ లేని ఇలాంటి ఘటనలు ప్రభుత్వం మారిన తర్వాత ఎందుకు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆలోచించాలన్నారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి శ్రీధర్‌రెడ్డి హత్యకేసు విచారణలో చాలా అనుమానాలున్నాయని, డీజీపీకి ఫిర్యాదు చేసినా.. చర్యలు నామమాత్రంగానే ఉండటం తన అనుభవంలో ఎన్నడూ చూడలేదని తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, నాయకులు అభిలాష్‌రావు, విజయ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



ఓ దుకాణంలో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

వీపనగండ్ల: దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి చంద్రశేఖర్, ఏడీఏ దామోదర్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, వారు కోరుకున్న విత్తనాలే అందజేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు. వారి వెంట మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏడుకొండలు...

పాలిసెట్‌లో 80 శాతం ఉత్తీర్ణత



మనోహర్



వి.అక్షర



మణిచరణ్

వనపర్తిటౌన్: పాలిసెట్ ఫలితాల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు సాంకేతిక విద్యాశాఖ తెలిపిందని స్థానిక కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 24 జరిగిన ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,394 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు.

- ఆత్మకూర్ బీసీకాలనీకి చెందిన ఎం.మనోహర్ ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 51వ ర్యాంకు, జిల్లాస్థాయిలో మొదటిర్యాంకు సాధించారు. అదేవిధంగా ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 145వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు.
- జిల్లాకేంద్రంలోని ఐజనగర్‌కాలనీకి చెందిన వి.అక్షర ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 72వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా ఎంపీసీలోనూ రాష్ట్రస్థాయిలో 120వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సాధించారు.
- పెబ్బేరు వినాయకనగర్‌కాలనీకి చెందిన కె.షర్మిల ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 87వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. అలాగే ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 145వ ర్యాంకు, జిల్లాలో 3వ ర్యాంకు సాధించింది.
- వనపర్తి ఎన్టీఆర్‌కాలనీకి చెందిన మణిచరణ్ ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 72వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 1వ ర్యాంకు సాధించారు.

సంఘటితంతోనే సమన్యాయం



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీధర్

వనపర్తిటౌన్: సంఘటితంగా ఉంటేనే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమన్యాయం దక్కుతుందని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీధర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాంచందర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నాగవరంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లా, పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పద్మశాలీలు అధికంగా ఉన్నారని.. వారికి తగిన గుర్తింపు దక్కేందుకు పాటుపడుతున్నామన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ నైతిక విలువలకు ప్రాముఖ్యతనిచ్చే కులస్తులుగా పద్మశాలీలకు గుర్తింపు ఉందని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి నుంచి సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ఎక్కడికక్కడ నాయకత్వం సంసిద్ధులు కావాలని, అప్పుడే రాష్ట్ర నాయకత్వం నుంచి ఆశించిన లక్ష్యాలు చేరుకునేందుకు వీలవుతుందన్నారు. భేదాభిప్రాయాలకు తావివ్వకుండా సమష్టి నిర్ణయాలతో గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎదిగేందుకు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా, పట్టణ కార్యవర్గ బాధ్యులను శాలువాతో సన్మానించారు. సంఘం ప్రతినిధులు నీలి నారాయణ, ఆర్.శ్రీనివాసులు, మునగాల శివరాము లు, తిరుమల ఉషన్న, శ్రీశైలం, చిన్ని కరుణాకర్, వెంకట నారాయణ, బాలప్ప, చెన్నపద్మ, మాణిక్యం, జానకిరాములు, సత్యనారాయణ, వెంకట్రాములు, శేఖర్, బాలస్వామి పాల్గొన్నారు.

పరిశీలకుల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని మక్తల్, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు పాదం సునమ్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు సేవాంగ్ భూటియా, కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలకు సురేంద్ర ప్రసాద్‌యాదవ్‌ను నియమించింది.

- నాగర్‌కర్నూల్ పరిధిలోని వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సత్పాల్‌శర్మ, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు రుచేశ్ జైవన్షీ కౌంటింగ్ అబ్జర్వర్లుగా వ్యవహరించనున్నారు.

'బీఆర్‌ఎస్, బీజేపీని ప్రజలు విశ్వసించరు'

వనపర్తిటౌన్: మాయమాటలతో ప్రజలను వంచించే బీఆర్‌ఎస్, మతం పేరుతో చిచ్చుపెట్టే బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్‌పార్టీ అత్యధిక స్థానాలు చేజిక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష, పోరాటాలను గుర్తించి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని.. ఇదే విషయాన్ని తొలి శాసనసభలో మాజీ సీఎం కేసీఆర్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోనియాగాంధీని ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని.. మేధావిగా పేరున్న ఆయన తన స్థాయిని దిగజార్చుకునే విమర్శలు చేయవద్దని హితవు పలికారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులందరికి 6 గ్యారెంటీలు అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోటాకు బీటలు వారాయని.. కాంగ్రెస్ బలం అమాంతం పెరిగిందని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు కదిరె రాములు, మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్ నందిమళ్ల యాదయ్య, నాయకులు బి.కృష్ణ, జానకిరాములు, అనీస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

వనపర్తిటౌన్: జిల్లాలో పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాకేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాల, అనూస్ అకాడమీ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు చాణక్య ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 69 మంది విద్యార్థులకుగాను 59 మంది హాజరుకాగా.. 10 మంది గైర్హాజరయ్యారని, అనూస్ అకాడమీ పాఠశాలలో 72 మంది విద్యార్థులకుగాను 57 మంది పరీక్షకు హాజరుకాగా.. 15 మంది రాలేదని జిల్లా అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ గణేష్ వివరించారు. 82.26 శాతం ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్లకు చెందిన చింతకుంట సుధాకర్(59) ఆదివారం రాత్రి గ్రామంలోని పెద్దచెరువుకు చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో సుధాకర్ నీటిలో మునిగి చనిపోయాడు. సోమవారం సుధాకర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పెద్ద చెరువులో వెతకగా మృతదేహం కనిపించింది. భార్య నర్సమ్మ, ఐదుగురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి చిన్నారి దుర్మరణం


శాన్విక (ఫైల్)

జడ్చర్ల: ఆటోలో నుంచి జారిపడి ఓ చిన్నారి మృతిచెందిన విషాదకర ఘటన సోమవారం మధ్యాహ్నం పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లికి చెందిన లక్ష్మి కుమార్తె శాన్విక (4), రెండునెలల మగ శిశువుతో కలిసి వేసవి సెలవుల్లో తల్లిగారింటికి వెళ్లింది. సోమవారం తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు తిమ్మాజిపేట మండలం మరికల్‌లో ఆటో ఎక్కింది. పట్టణ సమీపంలోని భీమయ్య డబ్బా వద్దకు రాగానే కుమారుడు పాల కోసం ఏడవడంతో లక్ష్మి అటువైపు తిరిగి పాలిచ్చేందుకు యత్నిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు శాన్విక జారి రోడ్డుపై పడింది. తల, చేతులకు గాయాలు కావడంతో వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అటునుంచి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు సీఐ తెలిపారు. విషయం తెలియగానే తండ్రి కుమార్, కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. కళ్లెదుటే కుమార్తె చనిపోవడంతో ఆ తల్లి రోదనలు చూసేవారి కంటతడి పెట్టించాయి.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న యువకులు

ధన్వాడ: ధన్వాడ మండలంలోని గోటూర్ గ్రామంలోని కోయిల్‌సాగర్ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామ యువకులు అడ్డుకున్నారు. కొద్ది రోజులుగా రాత్రి సమయంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారని, ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చినా, మామూళ్లు తీసుకోని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లు గ్రామంలో రాత్రి సయయంలో అతివేగంగా వెళ్తుడటంతో దుమ్ము, ధూళీ లేచి రాత్రిలో ట్రాక్టర్ల శబ్దానికి నిద్ర రావటందేని గ్రామస్తులు తెలిపారు. ఇసుక తరలింపుతో వాగులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారైనట్లు పేర్కొన్నారు. అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని, వాగులో బారీగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరారు.

ఎస్టీఎఫ్ అధికారుల దాడులు

- భారీగా బెల్లం, నాటుసారా స్వాధీనం

కొత్తకోట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం ఎస్టీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో భారీగా బెల్లం, నాటుసారా పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తకోట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-44పై హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వెళ్లే దారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ తండాకు ఓ వాహనంలో బెల్లం, అలం తరలిస్తుండగా.. ఎస్టీఎఫ్ అధికారులు రెక్కీ నిర్వహించి పట్టుకున్నారు. వాహనంలో 962 కిలోల బెల్లం, 10 కిలోల అలం, 6 లీటర్ల నాటుసారా లభించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి తెలిపారు. నార్లాపూర్‌కు చెందిన సాంబ అనే వ్యక్తిని అరెస్టు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, సుజన్, సిబ్బంది ఉన్నారు. బెల్లం వాహనాన్ని చాకచక్యంగా పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ విజయభాస్కర్‌రెడ్డిని అభినందించారు.


అలంపూర్ మండలంలో పొంగిపొర్లుతున్న జిల్లెలపాడు వాగు


అచ్చంపేట మండలం చంద్రవాగులో పారుతున్న వరద


గట్టు చెరువులోకి కాల్వ ద్వారా వస్తున్న వర్షపు నీరు

భారీ వర్షం

చెరువులు, కుంటల్లోకి చేరిన నీరు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- ఈదురుగాలుల ధాటికి నేలకొరిగిన చెట్లు
- కూలిన మట్టి ఇళ్లు
- ఉండవెల్లిలో అత్యధికంగా 9.7 సెం.మీ. వర్షపాతం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి మొదలుకొని సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెరువులు, కుంటల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలుల ధాటికి చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో మట్టి ఇళ్లు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉండవెల్లి మండలంలో అత్యధికంగా 9.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ముందస్తుగానే వర్షాల రాకతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


చెరువును తలపిస్తున్న ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

⇨ **ఆలంపూర్ మండలంలో 72.4 మి.మీ.** వర్షపాతం నమోదైంది. జిల్లెలపాడ్ వాగు పొంగిపొర్లింది. కాశీపూర్‌లోని లోతట్టు ప్రాంతంలో ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

⇨ మానవపాడు మండలంలో 60.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా.. చెన్నిపాడులో వడగండ్ల వాన కురిసింది. చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు వాగులు, వంకలు పొంగిపొర్లాయి.

⇨ గట్టు మండలంలో 38.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో వాగులు, వంకలు నీటితో పారాయి. గట్టు చెరువులోకి వర్షపునీరు చేరింది. మాచర్ల శివారులో గాలివానకు విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు పడటంతో తెగిపడ్డాయి.

⇨ ఉండవెల్లి మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి కురిసింది. భైరాపురం శివారులో ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉండవెల్లిలోని అనసూయమ్మ కాలనీలో లోలెవల్ బ్రిడ్జిని వర్షపునీరు ఎక్కి పారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రాగటూరు, మారమునగాల, చిన్న అముదాలపాడు గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెరువును తలపించింది.

⇨ మాగనూర్‌కు చెందిన బ్యాగరి ఆనంతమ్మ మట్టి ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

⇨ మరికల్ మండలంలోని ఎల్లిగండ్ల నుంచి స్టేజీ వద్దకు వచ్చే మార్గంలో ఉన్న కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ వద్ద రోడ్డు కుంగిపోయింది.

⇨ అచ్చంపేట మండలంలో 46.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. బొల్లట్‌పల్లి సమీపంలోని చంద్రవాగు, అక్కారం, చౌటపల్లి వాగులు, వంకలు నీటితో పారాయి.

⇨ చిన్నచింతకుంట మండలంలోని మన్నెపువాగుకు వచ్చిన వరదతో ఏదులాపూరం చెక్‌డ్యాం నిండి అలుగు పారింది. అప్పంపల్లి బస్టాండ్ వద్ద బీటీరోడ్డుకు ఏర్పడ్డ గుంత నీటితో పూర్తిగా నిండిపోవడంతో ఆత్మకూర్ - దేవరకద్ర మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

⇨ మదనాపురం మండలంలోని దుప్పల్లి, కొన్నూరు, రామన్‌పాడు, మదనాపురం, గోపన్‌పేట, కరివెన, దంతనూరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

⇨ పాన్‌గల్ మండలంలో 14.09 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచింది.

⇨ ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 58.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉదండాపురం సమీపంలోని పెద్దవాగు వర్షపు నీటితో పొంగిపొర్లింది.


భైరాపురం శివారులో నేలకొరిగిన భారీ వృక్షం


మాగనూర్‌లో కూలిన ఇంటిని చూపిస్తున్న అనంతమ్మ


మాచర్ల శివారులో విద్యుత్ తీగలపై పడిన చెట్టు


అలంపూర్ మండలంలోని కాశీపూర్‌లో నీట మునిగిన బస్సు


ఇంటిలోకి చేరుతున్న వర్షం నీళ్లు


ఇటిక్యాల మండలంలో పొంగిపొర్లుతున్న ఉదండాపురం పెద్దవాగు


చిన్నచింతకుంట మండలంలో అలుగు పారుతున్న ఏదులాపూరం చెక్‌డ్యాం


కొన్నూరులోని వ్యవసాయ పొలాల్లో నిలిచిన వర్షపునీరు


ప్రాగటూరు - మారమునగాల-2 మార్గంలో పారుతున్న వాగు

జోగుళాంబ ఆలయాన్ని దర్శించిన ప్రముఖులు


నవీన్‌కుమార్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. వారితో పాటు మరో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఉన్నారు. అదేవిధంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ కార్యాలయం నుంచి మాన్యూమెంట్ (ఇంజనీయర్ విభాగంలో) డైరెక్టర్ భీమానాయక్, డీఈ చంద్రకాంత్ కులకర్ణి, ఏఈ కృష్ణ చైతన్య, సిబ్బంది సంపత్, మునీందర్ ఆలయాలను దర్శించుకున్నారు.

ఆలయంలో రథోత్సవం

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం వారోత్సవ సేవలో భాగంగా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఉత్సవ విగ్రహాలను రథోత్సవంలో కూర్చోబెట్టి పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులంతా హరహరమహాదేవ శంభోశంకరా అంటూ ప్రాకార ప్రదక్షిణ చేశారు. అనంతరం గర్భాలయంలో మూలమూర్తికి దశవిదహారతులు అందజేశారు.

శ్రీశైలం ఘాట్‌రోడ్డుపై కొండచరియలు

- వాహనాల రాకపోకలకు తీవ్ర అవస్థలు

దోమలపెంట: దోమలపెంట ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కారణంగా ఈగలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు కొండచరియలు రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. మరో వైపు రోడ్డంతా గులకరాళ్లు, బురదతో నిండిపోయింది. అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ఆనకట్ట ఘాట్‌రోడ్డులో పెద్ద బండరాళ్లు రోడ్డుపైకి దొర్లుకుని రావడంతో శ్రీశైలంకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, వాహనాదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇక బురద ఉన్న ప్రాంతాల్లో ద్విచక్రవాహనదారుల వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జిల్లా ఆర్అండ్‌బీ వారు యుద్ధప్రాతిపదికాన స్పందించి శ్రీశైలం ఆనకట్ట ఘాట్‌రోడ్డులో అడ్డంగా పడిన కొండచరియలను తొలగించాల్సి ఉంది. దూర ప్రాంతాల నుంచి శ్రీశైలంకు బైకులపై వచ్చేవారు ఇతర వాహనాల్లో రావడం శ్రేయస్కరం.


శ్రీశైలం ఆనకట్ట ఘాట్‌రోడ్డులో అడ్డంగా పడిన పెద్ద బండలు


అవస్థలు పడుతున్న వాహనదారులు


వివాహిత అదృశ్యం

అడ్డాకుల: పొన్నకల్‌కి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కొమ్ము చెన్నకేశవులు దేవరకద్ర మండలం చౌదర్‌పల్లికి చెందిన శ్రీలతను కొన్నేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 30న మరికల్‌కు వెళ్లి వస్తానని శ్రీలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ లభించలేదు. చెన్నకేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు.

మెళకువలు పాటిస్తే మంచి ఫలితాలు

- వరి నారు మడుల ఏర్పాటుపై శాస్త్రవేత్తల సూచన


వరి నారుమడి (ఫైల్)


రాజేందర్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

మదనాపురం: ప్రస్తుతం కరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. నేపథ్యంలో ఈ సారి నీటి వసతి ఉన్న రైతులు నారు మడులు ముందుగానే పోసుకోవాలని అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో యాజమాన్య పద్ధతులు మెళకువలు పాటించాలనీ కేవీకే సీనీయర్ శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి సూచిస్తున్నారు. పలు సూచనలు ఇలా..

❐ దీర్ఘ చతురస్రాకారంలో ఉండేలా రెండు మూడు మీటర్ల వెడల్పుతో ఎత్తు మడులను తయారు చేసి మురుగునీరు పోయేందుకు కాల్వలు తీయాలి.

❐ భూసారాన్ని ఆధారంగా 5 సెంట్ల నారుమడికి కిలో బాస్వరాన్ని ఆఖరి దమ్ములో వేయాలి.

❐ 2 కిలోల నత్రజని రెండు బాగాలు చేసి ఆఖరి దమ్ములో విత్తిన 10-15 రోజుల్లో వేసుకోవాలి.

❐ 25-30 కిలోల విత్తనాలు ఎకరానికి నాటు కోవాడానికి సరిపోతాయి.

❐ కిలో విత్తనాలకు ఒక గ్రామ్ కార్బడిజం లీటర్ నీటి చొప్పున కలిపిన ద్రావణంలో 16-24 గంటలు నానబెట్టి తరువాత మండె కట్టుకొని మడుల్లో సమంగా వెదజల్లాలి.

❐ నారు రెండాకులు వచ్చె వరకు తడినిస్తూ 10 రోజుల తరువాత పలుచగా మడిలో నీటని నిల్వ ఉంచాలి.

❐ ప్రతి రోజు నారు మడిలో ఉన్న నిల్వ నీటి ఎప్పటికప్పుడు కాల్వాల ద్వారా తొలగించాలి.

❐ ఎల్లప్పుడూ తాజా నీటిని పారించాలి.

❐ రాత్రి ఉష్ణోగ్రతలు 10 -15 డిగ్రీలు ఉంటే ప్లాస్టిక్ సంచులతో గానీ దళసరి ప్లాస్టిక్ కాగితాలను కప్పి ఉదయాన్నే నీటిని తీసివేయాలి.

❐ నారు మడిలో జింక్ లోపాన్ని గమనిస్తే 2 గ్రామ్‌ల జింక్‌సల్ఫేట్‌ను లీటర్‌నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

❐ కలుపు సమస్య ఎక్కువగా ఉంటే 10 రోజుల తరువాత 5 సెంట్ల నారుమడికి 50మి.లీ బెథియోకార్బ్ ద్రావణాన్ని ఇసుకలో కలిపి చల్లుకోవాలి. తరువాత నారుమడిలో నీరు ఇంకిపోయేలా చూడాలి.

❐ నారు తీయడానికి వారం రోజుల ముందు సెంటు మడికి 160 గ్రామ్‌ల చొప్పున కార్బోఫ్యూరాన్ గులికలను పలుచగా చల్లుకోవాలి.

ఇలా ఎప్పటికప్పుడు నారుమడుల్లో జాగ్రత్తలు మెళకువలు పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని. నాటుకునే సమయంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉత్కంఠకు నేడే తెర

21 రోజుల నిరీక్షణ తర్వాత వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాలు

నేటి మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో స్పష్టత

- 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థుల పోటీ
- వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ
- బీజేపీ, జనసేనలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన టీడీపీ
- ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు ప్రారంభం
- ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు.. 45 వేల మంది పోలీసులు, 67 కంపెనీల సాయుధ బలగాల వినియోగం
- పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో పహారా

సాక్షి, అమరావతి: ఓటర్ల తీర్పు వెల్లడికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాలపై గత 21 రోజులుగా రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటికే విడుదలైన మెజార్టీ సర్వేల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారం చేపట్టనుందని తేల్చాయి. గత నెల 13వ తేదీన రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించడం, శనివారంతో చివరి దశ పోలింగ్ ముగియడంతో ఫలితాల కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సి వచ్చింది. నేటి మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత వస్తుంది. అయితే ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తి అయినప్పటికీ, ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను కూడా చివర్లో లెక్కించాల్సి ఉంటుంది. అందువల్ల అధికారికంగా ఫలితాల ప్రకటనకు కొంత జాప్యం అవుతుంది.



మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

ఫలితాలు ఇలా తెలుసుకోవచ్చు..

ఎన్నికల సరళిని, ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియచేసేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. లెక్కింపులో ఒక రౌండు పూర్తి కాగానే ఆ ఫలితాలను కౌంటింగ్ సెంటర్ వద్ద మైక్‌లో వెల్లడించడంతో పాటు, మీడియా ప్రతినిధులకు కనపడే విధంగా డిస్‌ప్లే బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రౌండు ఫలితాలను సువిధా యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. నియోజకవర్గ ఫలితాలతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఫలితాలను తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

https://results.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు. దీంతోపాటు 'ఓటర్స్ హెల్ప్‌లైన్' అనే యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఎన్నికల ఫలితాల సరళిని తెలుసుకోవచ్చు.

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం

రాష్ట్రంలో మొత్తం 4.13 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇందులో ఈవీఎంల ద్వారా 3.33 కోట్ల మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 5.15 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రికార్డు స్థాయిలో 81.8 శాతం ఓటింగ్ నమోదైంది. 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చేటు చేసుకోవడంతో, ఓట్ల లెక్కింపు సందర్భంగా అటువంటి సంఘటనలను పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు 111 అసెంబ్లీ స్థానాల్లో 5 – 6 గంటల్లోనే పూర్తి కానుంది. 61 నియోజకవర్గాల్లో 6 – 8 గంటలు, మూడు నియోజకవర్గాల్లో 9 – 10 గంటల సమయం పట్టనుంది. పార్లమెంటు ఫలితాలకు సంబంధించి 13 రౌండ్లు ఉన్న రాజమండ్రి, నరసాపురం ఫలితాలు తొలుత వెల్లడి కానుండగా, 27 రౌండ్ల లెక్కింపు ఉన్న అమలాపురం ఫలితం ఆలస్యంగా రానుంది. అసెంబ్లీ విషయానికి వస్తే కేవలం అయిదు గంటలలోపే తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నరసాపురం ఫలితాలు.. ఆలస్యంగా భీమిలి, పాణ్యం ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఒంటరిగా సిద్ధం

వైఎస్సార్‌సీపీ ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగానే 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసింది. తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీలతో జట్టు కట్టి కూటమిగా పోటీలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో ముందస్తుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోగా, తెలుగుదేశం పార్టీ సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికపై సిగపట్లు పడుతూ ప్రచారంలో వెనుకబడ్డారు. టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో, భారతీయ జనతాపార్టీ ఆరు పార్లమెంటు, 10 అసెంబ్లీ.. జనసేన రెండు పార్లమెంటు, 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో సామాన్యులను అభ్యర్థులుగా నిలబెట్టగా, తెలుగుదేశం పార్టీ పొత్తులు పెట్టుకొని తమ పార్టీకి చెందిన అభ్యర్థులను బీజేపీ, జనసేనల్లోకి పంపి అభ్యర్థులుగా నిలబెట్టింది.

మన పార్టీ కార్యకర్తలు గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారు

ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలు మనకు వేసిన ప్రతి ఓటునూ మన పార్టీ ఖాతాలోకి వచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించి మన పార్టీకి అఖండ విజయం చేకూరుస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

- సాక్షి, అమరావతి

ఫ్యాను గాలి వీచింది.. వైఎస్సార్‌సీపీదే విజయం

'సాక్షి' టీవీ చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టీకరణ

- సీఎం జగన్ అందించిన సంక్షేమం, సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది: ఆరా మస్తాన్
- 126 స్థానాలకంటే వైఎస్సార్‌సీపీకి అధికంగా వస్తాయి: ఆత్మసాక్షి మూర్తి
- సీఎం జగన్ చేసిన మంచికి కృతజ్ఞతలు చెబుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు: రేస్ కిషోర్
- అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే : ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్ ఇంద్ర నీల్



సాక్షి, అమరావతి: రాష్ట్రమంతా ఫ్యాను గాలి ఉధృతంగా వీచిందని, ఓటర్లలో అధిక శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో అత్యధిక శాసన సభ, లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తేల్చి చెప్పారు. 'సాక్షి' టీవీ సోమవారం రాత్రి నిర్వహించిన చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు 'ఆరా' మస్తాన్, 'ఆత్మసాక్షి' మూర్తి, 'రేస్' కిషోర్, 'ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్' ఇంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సానుకూల ఓటుతో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తోందని వారంతా స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

- టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేక కార్యకలాపాలు
- ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు సాక్ష్యాలు బట్టబయలైన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హత వేటు పడింది. ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేస్తూ, ఆ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ సోమవారం మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు. ప్రత్యర్థి పార్టీ టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన, పార్టీ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేశారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా హాజరై దీనిపై వివరణ ఇవ్వాలని నాలుగుసార్లు నోటీసులు పంపించినా రఘురాజు డుమ్మాకొట్టారు. మూడు నెలల కిందటే రఘురాజు భార్య, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు టీడీపీ నేత లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ కండువా వేయించుకున్నారు. టీడీపీ ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రఘురాజు దంపతుల నివాసంలోనే టీడీపీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు కోళ్ల లలితకుమారికి, ఎస్.కోట టికెట్ కోసం విఫల యత్నం చేసిన గొంప కృష్ణకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైదరాబాద్‌లో లోకేశ్ సమక్షంలో జరిగిన పంచాయితీలో మండల టీడీపీ నాయకులతో కలిసి రఘురాజు పాల్గొన్నారు. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ విప్ విక్రాంత్ ఫిర్యాదు చేశారు. రఘురాజు 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2027 వరకు పదవీ కాలం ఉన్నా పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడటంతో ఆయన సభ్యత్వం రద్దయింది.

27 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. సోమవారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి కొన్ని రోజులుగా స్వల్పంగా వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోయినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని ప్రకటించారు. రెండు వారాలుగా స్థానిక వర్షాల ఆధారంగా వస్తున్న స్వల్ప ఇన్‌ఫ్లో కూడా పూర్తిగా తగ్గిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 146 క్యూసెక్కులు, ఇతర అవసరాలకు 120క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 266 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.721 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన పాలమూరువాసి



పాలమూరు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంపును మహబూబ్‌నగర్‌లోని రవి చిన్నపిల్లల ఆస్పత్రి నిర్వాహకుడు డా.శేఖర్ అధిరోహించారు. నేపాల్‌లోని ఖాట్మండ్ నుంచి ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంపునకు చేరుకోవడానికి 8 రోజుల సమయం పట్టిందని తెలిపారు. పర్వతారోహణ సమయంలో అక్కడి వాతావరణం చాలా క్లిష్టంగా ఉందని.. ఎన్ని సమస్యలు ఎదురైనా తట్టుకొని లక్ష్యం పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. 8 రోజుల సమయంలో 65 కి.మీ. మేర ట్రెక్కింగ్ జరిగినట్లు వెల్లడించారు. ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు ఆక్సిజన్ స్థాయి 70 నుంచి 80 మధ్యలో ఉండటం వల్ల ఇబ్బంది పడినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొదటి సారిగా ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంపునకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సాగునీటి చౌర్యం..?

- మోటార్లతో నీటిని తరలిస్తున్న రైతులు
- ఏటా ఇదే తంతు.. పట్టించుకోని అధికారులు
- వర్షాధార పంటలే ఆధారం

సాలార్‌నగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు అందని నీరు


సాలార్‌నగర్ ప్రాజెక్టు

గండేడ్: ఈ ప్రాంత రైతుల జీవన ప్రమాణాలు పెంచేందుకు మండలంలోని చెన్నాయిపల్లి, సాలార్‌నగర్ గ్రామాల మధ్య 1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, అప్పటి ఎమ్మెల్యే కమతం రాంరెడ్డి సాలార్‌నగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలో పనులు పూర్తిచేసి ప్రారంభించారు. కుడి కాల్వ 5 కిలోమీటర్ల పొడవున, ఎడమ కాల్వ 3.5 కిలోమీటర్ల పొడవున 1,300 ఎకరాలుగా ఆయకట్టును స్థిరీకరించారు. కానీ ప్రాజెక్టు నీటిని అక్రమంగా వినియోగిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వందల ఎకరాల ఆయకట్టు బీళ్లుగా మారింది.

12 గ్రామాల ఆయకట్టుకు..

ప్రాజెక్టును సాలార్‌నగర్, లింగాయిపల్లి, రంగారెడ్డిపల్లి, వరహగిరిపల్లి, వెన్నాచేడ్ తదితర 12 గ్రామాలకు సాగునీరు అందించేటట్లుగా గెజిట్ రూపొందించారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1,300 ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. కాని ప్రస్తుతం 200 ఎకరాలకు కూడా అందడం లేదు. నిర్వహణ లోపం.. అధికారుల నిర్లక్ష్య ధోరణితో వనరులున్నా రైతులకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. తప్పని పరిస్థితుల్లో ఆయకట్టు రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారు. కొందరు సొంతంగా బోర్లు తవ్వించుకొని పంటలు పండించుకుంటుండగా.. బోర్లు లేని వారు మిగతా సమయాల్లో పొలాలను బీడు పెడుతున్నారు. ఒకటి, రెండు గ్రామాలకు మినహా మిగతా ఆయకట్టుకు చుక్కనీరు అందడం లేదు.

పేరుకే ప్రాజెక్టు...



ప్రాజెక్టు నిర్మాణంతో పొలాలకు నీరంది ఆర్థికంగా బాగుపడుతామని అనుకున్నాం. కానీ ప్రస్తుతం చుక్కనీరు కూడా రావడం లేదు. పేరుకే ప్రాజెక్టు.. కుంట కింద సాగైనంత భూమి మాత్రమే సాగువుతుంది. ఉన్న రెండెకరాల భూమి 20 ఏళ్లకు పైగా వర్షాధార పంటలకే పరిమితమైంది. అధికారులు చొరవచూపి తగిన చర్యలు తీసుకుంటే మా పొలాలకు నీరు అందుతుంది.

– దిద్ది వెంకటయ్య, రైతు, లింగాయిపల్లి

మోటార్లు వేస్తే కఠిన చర్యలు..

మిషన్ కాకతీయ కింద రూ.1.50 కోట్లతో పనులు చేపట్టాం. కట్ట పటిష్టం, అలుగు లీకేజీల మరమ్మతు చేయించాం. అలుగు కింద దెబ్బతిన్న ఆప్రాన్‌ను కూడా నిర్మించాం. దాదాపు పనులు పూర్తయ్యాయి. కాల్వల మరమ్మతుకు నిధులు లేవు. ప్రభుత్వం మంజూరు చేస్తే చేయిస్తాం. అక్రమంగా మోటార్లు వేసి నీటిని వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో మోటార్లు వేయడానికి వీలులేదు. ఎవరైనా వేస్తే ఫిర్యాదు చేయండి. ప్రాజెక్టును పరిశీలించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం.

– రేణుక, ఈఈ, ఇరిగేషన్ చేవెళ్ల డివిజన్

కానరాని కాల్వలు..


లింగాయిపల్లి వద్ద నీళ్లు లేని కాల్వ

గత ప్రభుత్వం ప్రాజెక్టు కాల్వలు, రివిట్‌మెంట్, కట్ట పనులకు మిషన్ కాకతీయ–4 పథకంలో రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. పనులు జరుగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో ఒక్కసారిగా ప్రాజెక్టు నిండి అలుగు పారింది. తర్వాత కొన్ని పనులు పూర్తి చేసినా.. ఇంకా చేపట్టాల్సిన పనులు ఉన్నాయి. తూము పూర్తిస్థాయిలో మరమ్మతు చేయకపోవడంతో నీటి వృథా అవుతోంది. కుడి, ఎడమ కాల్వలకు మరమ్మతు చేయకపోవడంతో ముళ్లపొదలతో నిండిపోయాయి. తూముల వెనకాల కొద్ది దూరం మాత్రమే కాల్వలు సరిగా ఉన్నాయి. మిగతా చోట్ల కాల్వల ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. కిలోమీటర్ల కొద్ది కుడి, ఎడమ కాల్వలను అప్పట్లో నిర్మించినా.. ప్రస్తుతం కనీసం కిలోమీటరు దూరం కూడా కాల్వలు లేవంటే నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో ఇట్టే తెలుస్తుంది.

నిండా మోటార్లే..

సాలార్‌నగర్, చెన్నాయిపల్లి, చెన్నాయిపల్లితండా, మాలగుడిసెలు, పూలపల్లి, చెన్నాయిపల్లి, పెద్దవార్వాల్ తదితర గ్రామాల రైతులు ప్రాజెక్టులో సుమారు 60 నుంచి 70 మోటార్లు వేసి నీటిని అక్రమంగా పంటలకు తరలించుకుపోతున్నారు. కొందరైతే ఏకంగా రెండు తూముల్లో నేరుగా మోటార్లు దింపి తరలిస్తున్నారు. అంతేగాకుండా ప్రాజెక్టు కట్ట పైనుంచి కాల్వల్లోకి పైపులు వేసి నీటిని పొలాలకు తరలిస్తున్నారు. కొందరైతే మోటార్లు కనిపించకుండా లోతునకు దింపి పైపులైన్ కనబడకుండా మట్టి వేస్తున్నారు. మండలంలో సాగయ్యే వేరుశనగలో ఎక్కువగా ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సాగవుతుండటం.. అక్రమ నీటితో సాగయ్యే పంటనే వందల ఎకరాల్లో ఉండటం గమనార్హం. సుమారు 25 ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా.. ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. సంబంధిత శాఖల అధికారులు కూడా అక్రమ నీటి వినియోగంపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. గతంలో రోనాల్డ్‌రోస్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు కొందరు రైతులు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తర్వాత వచ్చిన వారు ఎవరూ పట్టించుకోలేదు. గత నెలలో తహసీల్దార్ నాగలక్ష్మి మోటార్లు తొలగించినా అప్పటికే పుణ్యకాలం కాస్త దాటిపోయింది.


తూము వద్ద ఏర్పాటుచేసిన మోటార్లు (ఫైల్)

బీడీ కార్మికుల కూలి రూ.235కు పెంపు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/చిన్నచింతకుంట/అమరచింత: బీడీ కార్మికుల కూలి రూ. 207 నుంచి రూ. 235కు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. సోమవారం స్థానికంగా ఫ్యాక్టరీల యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంకటేశ్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఐదు సార్లు యజమానులతో చర్చలు జరిపినట్లు వివరించారు. 5వ దఫా చర్చలో వెయ్యి బీడీలకు రూ. 230 కూలి, ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్యం వాటా రూ. 05 మొత్తం కలిపి రూ. 235కు పెంచడానికి యజమానులు అంగీకరించినట్లు వివరించారు. కాగా గ్రాట్యూటీ సమస్య పెండింగ్లో ఉండడంతో ఆ విషయం కూడా చర్చించాలని కార్మిక సంఘాల నాయకులు పట్టుబట్టారు. కాగా ఫ్యాక్టరీల యజమానులు మరో వాయిదాను కోరారు. కాగా విషయంలో గతంలో మాదిరిగా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. అయితే కొత్త కూలి ఏప్రిల్ 1 నుంచే అమలు అవుతుందని వివరించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సోహెల్, సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వసీమ్, జియా అదేవిధంగా సంఘాల నాయకులు మాకం రామ్మోహన్, పి వెంకటేష్, రాబర్ట్, ఎస్ఎం ఖలీల్, పి యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, సూర్యం, దేవదానం, వేణుగోపాల్, బుచ్చన్న ఉన్నారు.


బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకులు

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు


ఏజెంట్లకు సూచనలు ఇస్తున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అందులో పాల్గొనే కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సూచించారు. సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో వారితో సమావేశమయ్యారు. ఎంపీ అభ్యర్థి, పార్లమెంట్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్, మహబూబ్‌నగర్, మక్తల్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజెంట్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ వేళ కేంద్రానికి సమయానికి చేరుకోవాలన్నారు. గుర్తింపు కార్డులను తప్పకుండా వెంట తీసుకొని వెళ్లాలన్నారు. కౌంటింగ్‌లో జాగ్రత్తగా, చురుగ్గా ఉండాలన్నారు. ప్రజంటేషన్ ద్వారా వారికి అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుడికి గ్రీన్ చాంపియన్ అవార్డు


చక్రవర్తి గౌడ్

చిన్నచింతకుంట: అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గుముడాల చక్రవర్తిగౌడ్‌కు.. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 2024 గ్రీన్ చాంపియన్ అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5న హైదరాబాద్‌లోని మండలి ఆడిటోరియంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం, నీటి వనరులు, మొక్కల సంరక్షణ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిలో చైతన్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేస్తున్నందుకు గానూ అవార్డు లభించినట్లు చక్రవర్తిగౌడ్ వివరించారు.

పోలీసులపై దాడి.. ఇద్దరికి రిమాండ్

అమ్రాబాద్: పదరలో శనివారం విధుల్లో ఉన్న పోలీసులు ఖలీల్, రాజశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన వినోద్, విజయ్ దాడి చేశారు. ఇద్దరిపై కేసును మోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.